క్లుప్తంగా

మలాథిన్ పిచికారీ



సదుం: ద్రావణం పిచికారీ చేస్తున్న సిబ్బంది

సదుం: మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్, బీసీ బాలికల హాస్టల్, ఎంజేపీ గురుకుల పాఠశాల్లో ఆరోగ్య సిబ్బంది మలాథిన్‌ను గురువారం పిచికారీ చేశారు. విద్యార్థులు అంటు రోగాలకు గురికాకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమకాటుతో పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఉదయభాస్కర్, నీలకంఠ, వార్డెన్ బాబు పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధులతో సమీక్ష

సోమల: మండలంలోని ప్రజాప్రతినిధులతో వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతో శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు జింకా చలపతి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సమీక్ష నిర్వహిస్తారని జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు గురువారం తెలిపారు. సోమల సమీపంలోని సుబ్రమణ్యంస్వామి ఆలయ సమీపంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

సింహ వాహనంపై కోదండరాముడు



సింహవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

శాంతిపురం: మండలంలోని రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం ఉదయం సీతాలక్ష్మణ సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్వామివారి ఊంజల్‌సేవ నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారు సింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ రమేష్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శుక్రవారం హనుమంత వాహన సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కారు–ద్విచక్ర వాహనం ఢీ

సోమల: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని నెల్లిమంద పంచాయతీ కొత్త నవాబుపేటకు చెందిన సయ్యద్ బాషా, అతని భార్యకు అనారోగ్యంగా ఉండడంతో చౌడేపల్లిలోని ఆస్పత్రికి ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్నాడు. అయితే కందూరు–మేటిమంద మార్గంలో మేడిమాను బావి వద్ద చౌడేపల్లె నుంచి వేగంగా వస్తున్న ఓ కారు ఢీకొనడంతో వారికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో స్థానికులు పీలేరు ఆస్పత్రికి తరలించారు. వారి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ సైనికుల క్యాంటీన్‌లో ఎన్నికల ప్రచారం

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని మాజీ సైనికుల క్యాంటీన్‌లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న మాజీ సైనికుడు కమ్మిశెట్టి భాస్కరరావు కరపత్రాలను మాజీ సైనికులకు అందజేశారు. అనంతరం ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు గోవిందరాజు, నరసింహులు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) మండల కార్యవర్గం ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మేకల సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామి వెల్లడించారు. వారు మాట్లాడుతూ గురువారం నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న ఎంసీపీఎస్‌లో మండల స్థాయి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఎస్జీటీలుగా పని చేస్తున్న కె.గోపినాథ్ అధ్యక్షులుగా, రాజా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకైనట్లు వెల్లడించారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

యాదమరి: పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వయోజన విద్యాశాఖ డీడీ నాగేశ్వర్ రెడ్డి కోరారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బందికి రెవెన్యూ, పంచాయతీ అధికారులకు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటును ఎలా వినియోగించుకోవాలో వివరించారు. ఓటింగ్ పద్ధతిని తెలియజేశారు. ఈ అంశాలను ఓటర్లను కలిసి వివరించాలని సూచించారు. ఎంపీడీఓ శివరాజ్, తహసీల్దార్ చిట్టిబాబు, ఏపీఓ హరినాథ రెడ్డి పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందాం

- చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్
- ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపు



ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్థానికులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ భరత్





మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, అడుసుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కుప్పం రూరల్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గురువారం ఆయన కొత్తపేటలోని వినాయక ఆలయంలో పూజలు చేపట్టి 13వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సేవాభావం ఉన్న వ్యక్తి అని, ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శాసన మండలికి ఆయనను పంపితే పట్టభద్రుల సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. అందువల్ల పేర్నాటి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హంసా సోమశేఖర్, మోహన్‌రామ్, చీలేపల్లిరవి, మునిరాజు ఉన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీ గెలిపించుకుందామని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పార్టీ శ్రేణులకు కోరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణ నాయకులతో గురువారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లు తొలి ప్రాధాన్యత ఓటును శ్యాంప్రసాద్‌రెడ్డికి వేసేలా ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలు ఏవైనా సరే వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు మన ప్రభుత్వం చేసిన మేలును గుర్తు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక నేతల బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, కన్వీనర్ జాఫర్, మండీసుధా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీచేస్తున్న పేర్నాటీ శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సోమల పంచాయతీలోని గ్రామాల్లో సచివాలయ మండల కన్వీనర్ రాశెట్టి మధు ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి శ్యాంప్రసాద్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు నాగభూషణంరెడ్డి, రమణ, చక్రపాణి, సరస్వతమ్మ, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి గౌస్‌పీర్ బాషా, రిటైర్డ్ టీచర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



ఉరుసు మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

- దాదేపల్లిలో మూడురోజుల పాటు ఘనంగా జరగనున్న ఉరుసు

చౌడేపల్లె: దాదేపల్లెలోని హజ్రత్ సయ్యద్ పీర్ మషాయఖ్ బహదూర్ అలీషా బాబా దర్గాలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఉరుసు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి స్థానిక ముస్లిం మైనారిటీ నేతలతో కలిసి ఉరుసు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉరుసు మహోత్సవంలో ముఖ్య అతిథులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ దామోదరరాజు పాల్గొంటారని వారు తెలిపారు. 14 మంగళవారం గంధం మహోత్సవం, 15న బుధవారం ఉరుసుతో పాటు రాత్రి ఖవ్వాలి పాట కచేరీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముంబైకి చెందిన జీటీవీ సింగర్ కౌసర్ సాబరి, ఉత్తర ప్రదేశ్ సహన్‌పూర్‌కు అస్లాం ముకరం సాబరి ఖవ్వాలీ గాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు. 15న గురువారం తహలీల్ ఫతేహా కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కులమతాలకు అతీతంగా ప్రజలు ఉరుసులో పాల్గొని బాబా దీవెనలను పొందాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు సుల్తాన్‌సాబ్, సాధిక్‌బాషా, షేర్‌ఖాన్, చిన్నరెడ్డి బాషా, ఆరీఫుల్లా, అమానుల్లా, సనావుల్లా, లతీఫ్, బాబాజాన్, బషీర్‌సాబ్, సయ్యద్, ఖాదర్ బాషా తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



వడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: ప్రభుత్వ ఆదేశాల మేరకు పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, అలాగే హాజరు రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ ఈశ్వరయ్య ఆదేశించారు. గురువారం ఆయన ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్‌తో కలిసి మండలంలోని సోమల, ఇరికిపెంట పంచాయతీల్లోని భారతంమిట్ట, వడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌లో పిల్లల హాజరు నమోదు చేయకపోవడంతో పాటు మెనూలో లోపాలు ఉన్నట్లు గుర్తించి అంగన్‌వాడీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, నేతలు నాగభూషణంరెడ్డి, వరదం రమణ, చక్రపాణి పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి

చౌడేపల్లె: మండలంలోని వెంగళపల్లె ఎంపీటీసీ సభ్యుడు బి.లక్ష్మినర్సయ్య మాజీ సర్పంచ్ జయమ్మ కుమారుడు యోగీష్‌కు, అదే గ్రామానికి చెందిన అనూషతో శుక్రవారం వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మాజీ ఎంపీపీ అంజిబాబు, మాజీ ఎంపీటీసీలు పద్మనారెడ్డి, రమేష్‌బాబు, కోఆప్షన్ మెంబరు సాధిక్ బాషా, సర్పంచ్ నాగరత్న, నేతలు శ్రీనివాసులు, శేఖర్ తదితరులు ఉన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



సదుం: సర్వేరాళ్లు నాటిస్తున్న అధికారులు

సదుం: రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని 79ఏ చింతమాకులపల్లెలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా గురువారం సర్వే రాళ్ల నాటే పనులను పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జుననాయుడు, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో రామస్వామి పాల్గొన్నారు.

ఆడ పిల్లలను రక్షించుకుందాం



మాట్లాడుతున్న మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి

రొంపిచెర్ల: సమాజంలో ఆడపిల్లలను రక్షించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి అన్నారు. ఆమె బుధవారం రొంపిచెర్ల కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల సంక్షేమం కోసం వారి చదువుల కోసం భారతదేశం 2015లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రూ.100 కోట్లతో పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. బాలికలు రోజు రోజుకు తగ్గిపోతున్నారని చెప్పారు. 1000 మంది బాలురు ఉంటే 919 మంది మాత్రమే బాలికలు ఉన్నారని తెలిపారు. ఈ సంఖ్య రాను రాను తగ్గిపోయే ప్రమాదం ఉందని, దీని వల్ల రానున్న రోజుల్లో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గర్భంలో ఆడపిల్ల అని తెలుసుకుని కడుపులోనే చంపి వేస్తున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం బాలికల అభివృద్ధికి కృషి చేయాలని బాలికలు అంతా ప్రమాణం చేశారు. సమావేశంలో డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, సీహెచ్ఓ కాంతమ్మ, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్

రామకుప్పంలో..

రామకుప్పం: మండలంలోని విజలాపురం కస్తూర్బా పాఠశాలలో గురువారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో భేటీ బచావో– భేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. లింగవివక్షను రూపుమాపడం ద్వారా బాలికల సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. నోడల్ ఆఫీసర్ డా.సందీప్, ఎస్ఓ జాన్సీ, హెల్త్ అసిస్టెంట్ బాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

రామకుప్పం: మండలంలోని అయ్యప్పగానిపల్లిలో గురువారం సుమారు 266 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా పశువులు అంటు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వేసవికాలంలో పశువులు చర్మవ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, గోపాలమిత్ర, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది తీరుపై నిరసన



కుప్పం ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కుప్పం: సమయానికి బస్సులు రావడం లేదని, అడిగితే ఆర్టీసీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తిస్తున్నారని గుడుపల్లె మండలానికి చెందిన విద్యార్థులు ఆరోపించారు. గురువారం వారు ఆర్టీసీ బస్టాండు ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గుడుపల్లె మండలం సంగనపల్లి, పోగురుపల్లి, ఓఎన్ కొత్తూరు గ్రామాలకు వచ్చే బస్సులు సక్రమంగా రావడం లేదని, అడిగితే ఆర్టీసీ యాజమాన్యం తమపైనే అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు కళాశాలలు, స్కూళ్లకు వెళ్లే సమయానికి రాకుండా, ఇష్టానుసారంగా బస్సులు నడుస్తున్నాయని ఆరోపించారు. ప్రతిరోజు సక్రమంగా బస్సులు లేకపోవడంతో కళాశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు. ఈ విషయాన్ని అడగడానికి ఆర్టీసీ డిపో దగ్గరకు వెళ్తే అక్కడి సిబ్బంది ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఆరోపించారు. విషయం తెలిసి డిపో మేనేజర్ స్వామి స్పందించి విద్యార్థులతో మాట్లాడారు. సిబ్బంది తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు కళాశాలలు, స్కూళ్లకు వెళ్లే సమయానికి బస్సు సర్వీసులు నడుపుతామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు నిరసన విరమించారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: పరీక్షలు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు రాకపోవడంపై స్థానిక విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు స్థానిక రైల్వేస్టేషన్ క్రాస్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసానత్తం, సంగనపల్లె, గుడుపల్లె మీదుగా వెళ్తున్న బస్సులను నడపకపోవడంతో పరీక్షల వేళ కళాశాలలు, స్కూళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సుమారు రెండుగంటల సేపు ఆందోళన చేస్తే ఎవరూ స్పందించకపోవడంతో విద్యార్థులు కుప్పం ఆర్టీసీ డిపో వద్ద నిరసనకు దిగారు. అక్కడ ఆర్టీసీ డిపో మేనేజర్ వారితో మాట్లాడి తగిన సర్వీసులు నడుపుతామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించుకున్నారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన



గంగ్రాజుపల్లి వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ పరిధిలోని పలుచోట్ల నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం ట్రాన్స్‌కో ఎస్ఈ(ఆపరేషన్) కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. ఆ మేరకు గంగవరం మండలంలోని గంగ్రాజుపల్లి, బైరెడ్డిపల్లి మండలంలోని ఆలపల్లి, గొల్లచీమనపల్లి వద్ద కేటాయించిన స్థలాలను చూసి అక్కడి పరిస్థితులను అధికారులు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన కరెంట్‌ను రైతులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో పుంగనూరు డీఈ విజయన్, పలమనేరు ఏడీ చిన్నబ్బ, సంబంధిత మండలాల ఏఈలు పాల్గొన్నారు.

సింహ వాహనంపై శ్రీవారి చిద్విలాసం



భక్తులను కటాక్షిస్తున్న శ్రీవారు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారు గురువారం ఉదయం సింహవాహనం పైనుంచి భక్తులను కటాక్షించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే సాయంత్రం ముత్యపు పందిరిపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శిశుమరణాల నియంత్రణకు కృషి చేయండి



కస్తూర్బా స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుదర్శన్

పుంగనూరు: సమాజంలో బాల్యవివాహాలను అరికట్టడం, బాలికల శిశుమరణాలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని బాలికా సంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ సుదర్శన్ అన్నారు. గురువారం మండలంలోని అడవినాథునికుంటలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయరాదని, గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, బాలికల పట్ల అసమానత చూపరాదన్నారు. అలా ఎవరు ప్రవర్తించినా దిశ చట్టం ప్రకారం శిక్షార్హులన్నారు. బాలికలను గౌరవించి, వారి సంరక్షణకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సల్మాబేగం, హెల్త్ ఆఫీసర్ సావిత్రి, ప్రిన్సిపల్ టీఎస్ రమా, వైద్యసిబ్బంది హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

పుంగనూరు: మున్సిపాలిటీకి చెందిన వారపుసంత, కూరగాయల మార్కెట్, బస్టాండు, మరుగుదొడ్లు, ఖాళీ రూములకు వేలంపాట గురువారం వేసినట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీని తెలియజేస్తామన్నారు.

బైరసప్ప కొటాలులో జ్వరాల పంజా

కుప్పం: మండల పరిధిలోని దాసేగానూరు పంచాయతీ బైరసప్ప కొటాలు గ్రామంలో వారం రోజులుగా జ్వరాలు ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. 60 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో విష జ్వరాలు సోకడంతో ప్రజలు నిత్యం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పిల్లలకు విపరీతమైన దగ్గు, జ్వరం సోకి పిల్లలు తట్టుకోలేకపోతున్నారు. వారంరోజులుగా గ్రామంలో ఇదే పరిస్థితి ఉండడంతో నిత్యం ఆస్పత్రుల చుట్టూ తిరగలేక సతమతమవుతున్నారు. కుప్పం వంద పడకల ఆస్పత్రికి వెళ్తున్నా, జ్వరాలు తగ్గుముఖం పట్టకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తక్షణం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



రెడ్డెమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సోమల: మండలంలోని పొదలగుంటపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రమేష్ తల్లి రెడ్డెమ్మ అనారోగ్యంతో బుధవారం రాత్రి మరణించారు. విషయం తెలిసి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గురువారం ఉదయం గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణంరెడ్డి, సర్పంచ్ జయరాం, నేతలు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లె పంచాయతీ అగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాజారెడ్డి, సర్పంచ్ మురళీరెడ్డి తల్లి లక్ష్మమ్మ మూడురోజుల క్రితం మరణించింది. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గురువారం పరామర్శించారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణంరెడ్డి, గోవిందరెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

సాగు ఖర్చు తగ్గించుకోండి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పెద్దపంజాణి: సాగు ఖర్చు తగ్గించుకుని, పంట ఉత్పత్తి, నాణ్యతను పెంచుకునే విధంగా ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని ఎర్రబల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమాన్ని పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్‌తో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరిలో జనుము, జీలుగ వాడిత్లే భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులంతా వరి పంటకు నానో యూరియా 5 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఏఓ రకీబా, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.